

# నిగేమ!

డి. కామేశ్వరి

కారు హారన్ రెండుసార్లు వినిపించింది.

"అదిగో అంతా వచ్చేశారు పద-పద" అన్నాడు రాంమోహన్.

"గీతాజీ అభీతక్ తయార్ నహీ హువా!" అంటూ హడావిడిగా వర్మ లోపలికి వచ్చాడు.

"జస్ట్ ఎ మినిట్" గీత బాస్కెట్లు సర్ది నేప్కిన్‌లు పెట్టి పనికత్తెని కార్లో పెట్టమంది. రాంమోహన్ రికార్డ్ ప్లేయర్ పట్టుకుని 'కమాన్ లెటజ్ గో' అన్నాడు.

బయట రెండుకార్లు నిండా అంతా కూర్చుని వున్నారు. రాంమోహన్‌ని, గీతని చూసి అంతా విష్ చేశారు. గీత ఒకకారులో శేఖర్ వుండడం చూసి, మరొక కారు ఎక్కబోయింది. 'కమాన్ గీతా, ఇక్కడ నీకోసం చోటుంచాం" అంది కవిత తలుపు తీసి. గీత ఎక్కింది. రాంమోహన్ మరో కారు ఎక్కాడు. రెండుకార్లు బయలుదేరాయి.

"హాయ్-గీతా, యూ లుక్ లవ్లీ టుడే' కవిత గీతనిచూసి అంది.

"కొత్తచీరా గీతా!" అంది మిసెస్ చంద్రశేఖర్ గీత చీరని పరీక్షిస్తూ.

"ఆర్గారామ్‌లోనా కొన్నావు?" అప్పుడే కారుదిగి ఆచీర కొనాలన్నంత ఆరాటం కనపరుస్తూ ఆరాతీసింది కవిత.

శేఖర్ వెనక్కి తిరిగి గీతవైపు ఒక్క క్షణం కన్నార్పకుండా చూశాడు. గీత క్రిందపెదవి నొక్కిపట్టి మొహం తిప్పుకుంది.

"ఈ ఆడవాళ్లకి ఎంతసేపూ చీరలు, నగలు తప్ప మరోమాట లేదు. ఎన్ని చీరలున్నా మరొకరి చీరే ఎప్పుడూ బాగుంటుంది." వర్మ నవ్వుతూ అన్నాడు డ్రైవ్ చేస్తూ. కపూర్ నవ్వాడు వెనక్కి తిరిగి చూసి.

వెనకసీట్లో ఆడవాళ్లు ముగ్గురూ ఆ మాట విననట్లు ఒకరి అలంకారాలు ఒకరు మెచ్చుకుంటున్నారు. కొత్తఫేషన్ చీరలు ఏ షాపులో వచ్చింది, మొన్న కొత్తరకం డిజైను రుబీసెట్టు ఏ షాపులో చూసింది అతిసీరియస్‌గా మాట్లాడుతున్నారు.

వెనకనించి కిషన్‌చంద్ కారు రొయ్యిన దూసుకు ఓవర్‌టేక్ చేసింది వర్మకారుని. "హాయ్!" అంటూ చెయ్యి ఊపింది ఆ కారులోంచి మిసెస్‌వర్మ గేలిచేస్తున్నట్టు.

"కమాన్ మిస్టర్ వర్మా స్పీడ్ అప్ - లతా వాళ్ళని ఓవర్‌టేక్ చెయ్యాలి మనం"

కవిత ముందుకువంగి వర్మని తొందర పెట్టింది.

"దోన్ట్‌వర్రీ - ఎంబాసిడర్‌ని ప్లిమత్ ఎంత సేపు ఓవర్ టేక్ చేయడం' అంటూ ఏక్సిలేటర్ నొక్కాడు వర్మ గ్ర గా-ఎంబా సిడర్ డ్రైవ్ చేస్తున్న కిషన్‌చ ద్ వెనక కారుకి సైడ్ ఇవ్వకుండా మరింత పెంచాడు స్పీడు. రెండుకార్లల్లోవాళ్లు డ్రైవ్ చేస్తున్న వాళ్లని ప్రోత్సహిస్తున్నారు గో చేస్తూ — వెడల్పురోడ్డు రాగానే ప్లిమత్ రయ్యిన దూసుకువెళ్ళి ఎంబాసిడర్‌ని వర్ టేక్ చేసింది. కవిత చెయ్యిడూపి వెక్కి రించింది వెనకకారు వాళ్ళని.

'కమాన్ కిషన్' లత కిష చంద్‌ని స్పీడు పెంచమని గాభరాపెట్టసా ంది.

''చాల్నాలు- ఇదేం కారు రే ుకాదు - సవ్యంగా చేరాలని లేదా ఏమిటి లతాజీ'' చటర్జీ అన్నాడు.

రెండు కార్లు సందడిగా గిపోతు న్నాయి. ఆ రెండు కార్లల్లో మొత్తం పన్నెండుమంది. అంటే ఆరు జంటలు వున్నాయి. హైక్లాస్‌కి చెందిన ఆ ఆరు జంటలని చూస్తే - డబ్బు, వ్వనం, అందం, ఆనందం కలబోసినట్టుం ుంది. ఆ ఆరుజంటలు — మిస్టర్ వర్మ, లత వర్మకి చాలారకాల బిజినెస్‌లు వున్నాయి. హోటళ్లు మూడున్నాయి ఆ సిటీలో క పెనీల్లో అనేక షేర్లున్నాయి. లక్షాధికారి ఎ ి చెప్ప వచ్చు. మిసెస్‌వర్మ, లత పేర కితగ్గట్టు లతలాగే వుంటుంది నాజూగ్గా. ఇద్ద పిల్ల ల తల్లి లాగే అన్పించదు. ఆమెలాం అంద గత్తె పక్కన వర్మ కాకిముక్కు క దొండ పండులా వుంటాడు. బట్టతల స్థూ కాయం పొట్ట. బాహ్యరూపం ఎలావున్నా వర్మ సహృదయుడు స్నేహపాత్రుడు. భార్య అంటే అనురాగం ఆరాధన. క ి లత అతన్ని కేర్‌చెయ్యదు. అతనికి తనపట్ల వున్న ప్రేమ గుర్తించదు. కేవలం డబ్బు మాత్రం చూసి అతన్ని చేసు ందని చెప్పవచ్చు.

తరువాత జంట - రాంమోహన్ గీత. రాంమోహన్ పెద్ద ఇంజనీరింగ్ ఫర్మ్‌కి జనరల్ మేనేజర్. రాంమోహన్ ఎంత హడావిడి నిషో— గీత అంత శాంతంగా వుంటుంది అతనికి స్నేహితులు పార్టీలు క్లబ్బులు కాట అంటూ ఎప్పుడూ ఏదో హడావిడిగా వుంటాడు. గీత ఫామిలీ సైపు- భ కోసం పార్టీలలో పాల్గొంటూ వుంటుంది. ముచ్చటగా ఇద్దరు పిల్లలు వారికి.

మూడో జంట - చంద్రశేఖర్, పద్మ. చంద్రశేఖర్ రాంమోహన్ పనిచేస్తున్న ఫర్మ్‌లో సేల్స్‌మేనేజర్‌గా ఉంటున్నాడు. చంద్రశేఖర్ చాలా అందగాడు. ఆరడు గుల పొడుగుతో, పచ్చగా ఆరోగ్యంతో మిసమిసలాడు తుంటాడు. ఆడదాన్ని ఆక ర్షించేదేదో అందతనిలో-జాలీటైప్- మంచి మాటకారి-కొత్త కొత్త జోక్స్‌కట్ చేస్తూ ఎప్పుడూ అందరిని నవ్విస్తూ ఆకర్షిస్తాడు- పార్టీలలో కొత్త కొత్త గేమ్స్ ఇన్‌ట్రొ డ్యూస్ చేస్తూ చలాకీగా తిరుగుతుంటాడు- పార్టీలలో-ఫంక్షన్స్‌లో అతనో 'మస్టు' అనుకుంటారు అందరూ-భార్య పద్మ అందగత్తె కాదు. అతనిముందు ఈమెని చూసి దేవుడిలాంటి జంటలని ఎందుకు కూరుస్తాడో అనుకోకుండా వుండలేరు ఎవరూ-కాని ఆమె చాలా మంచిది-మెత్త టిది. కోపమన్నది ఆమె మొహాన ఎన్నడూ కనపడదు.

నాలుగో జంట-కిషన్‌చంద్ - కవిత- బట్టల మిల్లు యజమాని. లక్షలమీద వ్యాపారం లమీద లాభాలు. భార్యాభర్త లిద్దరూ అందగాళ్ళే! ఇద్దరూ అల్ట్రా మోడ ర్న్‌గా వుంటారు. డబ్బు పుష్కలంగా వుందేమో బట్టలు మార్చినంత సులువుగా అందిన ఆడవాళ్ళని అనుభవిస్తూంటాడు కిషన్‌చంద్ - తప్పతాగుతాడు. కవిత భర్తకి ఏంతీ పోదు. ఆ యింట్లో భార్యా భర్తలది ఎవరితోవ వారన్నట్లు ఒకరి వ్యక్తిగత విషయాలు ఒకరు పట్టించు కోరు. కాని క్లబ్బులకి, పార్టీలకి కలిసి వెడుతూ పైకి అన్యోన్యదంపతుల్లా 'షో' మెయిన్‌టైన్ చేస్తుంటారు. కవిత గురించి అనేకపుకార్లు విననట్టు నటిస్తాడు కిషన్ చంద్. కవిత అందంతోపాటు ఆమె యిచ్చే చనువు మగా అందరికి ప్రోత్సాహకరంగా వుంటుంది, చాలా చలాకీగా వుంటుంది.

ఐదోజంట: చటర్జీ - మాయ. చటర్జీ పెద్ద డాక్టరు. క్షణం తీరికలేని సర్జన్ - నర్సింగ్ హోమ్‌పెట్టి వేలకివేలు ఆర్జి స్తున్నాడు. ఎంత తీరికలేని ప్రాక్టీసు వున్నా ఆదివారాలు పని చేయననే నియమం పెట్టుకున్నాడు. ఆ రోజు క్లబ్బుకి, పార్టీ లకి, పిక్నిక్‌లకి వెడుతూంటాడు. మాయ పెద్ద చదువు చదివింది. డాక్టరేట్ వుంది. దానికితోడు మంచిగొంతు - రవీంద్ర గీతాలు అద్భుతంగా పాడుతుంది. భార్యా భర్త లిద్దరూ ఒకరి నొకరు అమితంగా ప్రేమించుకుంటూఅన్యోన్యంగా వుంటారు. సింపుల్‌గావుంటూ అందరినీ ఆకర్షిస్తారు.

ఆరోజంట: కపూర్ - నీలిమ. కపూర్ పెద్ద కంట్రాక్టరు. లక్షలమీద బిజినెస్సు చేస్తూంటాడు. నీలిమ అనాకారి - మెల్ల - ఎత్తుపళ్లు - వికారంగా వుంటుంది. నీలిమ తండ్రికి ఏకైక సంతానం. లక్షల వారసు రాలు. ఆమె తెబోయే లక్షలకోసమే కపూర్ ఆమెను పెళ్లాడాడు. కపూర్ బీద కుటుంబంనించి వచ్చినవాడు. డబ్బు విలువ తెలుసు గనక భార్య తెచ్చే లక్షలకి ఆకర్షింపబడ్డాడు. ఆ డబ్బుతో కంట్రా క్టులుచేస్తూ మరిన్ని లక్షలు చేర్చాడు. నీలిమ అనాకారి అయినా మనసు అందమైనది. భర్త తనని ఎందుకు పెళ్లాడాడో తెలుసు. తను అందగత్తె కానని తెలుసు. అందుకే అతను ఎలా ప్రవర్తించినా, ఏమన్నా స్పోర్టివ్‌గా తీసుకుని నవ్వేస్తుంది.

ఈ ఆరుజంటలు - ఫేమిలీ ఫ్రండ్సు. కొందరికి క్లబ్బు పరిచయం, కొందరికి ఆఫీసు పరిచయం, కొందరికి మిత్రుల ద్వారా పరిచయం అయి, అలా అలా స్నేహం గట్టిపడింది. ఇప్పుడు క్లబ్బుకి వెళ్ళినా, పిక్నిక్ వెళ్ళినా, సినిమాకి వెళ్ళినా అందరూ కలిసే వెడతారు. పండగలొస్తే ఎవరి పండగకి వారు మిగతా వారిని పిలుస్తూంటారు. నెలకోసారి పిక్ని క్కులు పెట్టుకుని ఎటో అటు తిరుగుతూం టారు సరదాగా.

కార్లు బొటానికల్ గార్డెను చేరాయి, అందరూ బిలబిలలాడుతూ దిగి, బాస్కెట్లు ఫ్లాస్కులు ట్రాన్సిస్టర్లు పట్టుకుని దట్టంగా

వున్న చెట్లకిందకి చేరారు. చంద్రశేఖర్ పెద్ద జంపుకానా పరిచాడు. వర్మ ఆయాసంగా చతికిలబడి ''కాఫీ-కాఫీ'' అన్నాడు.

''అప్పుడే ఆరంభం తిండిగోల!'' లత కోపంగా అంది.

''గీతాజీ, మా ఆవిడ ఎలాగూ ఈయదు. మీరన్నా కాస్త దయగా దీనుడిమీద దయతలచండి...' బతిమిలాడాడు వర్మ.

''ఆ చేత్తో మాకూనూ -' అన్నాడు కిషన్‌చంద్ నవ్వి.

''తిండికి మొహం వాచిపోయినట్లు వచ్చినదగ్గరనించి తిండిగోలే అయితే ఇళ్ల దగ్గిరే కూర్చుని తినవలసింది' కవిత సాధించింది.

''ఊరుకో కవితా, కాఫీయే గదా -' అంది గీత కాఫీ కప్పుల్లో పంచుతూ.

మాయా అందరికీ కప్పులు అందించింది.

''గీతా జీ అప్ 'ఇస్తిభాత్' (పులిహోర) 'బొబ్బట్టు' లాయా హైనా!'' ఆరా తీశాడు వర్మ.

''అవి తీసుకురాకపోతే వూరుకుంటారా మీరు'' గీత నవ్వింది.

''ఏం అవికూడా తినేస్తారా యిప్పుడే'' గయ్యిమంది లత.

''అబ్బబ్బ వూరుకోండి లతాజీ!.... ఇద్దరూ దెబ్బలాడుకోడానికి వచ్చారా ఏమిటి?'' కపూర్ నవ్వుతూ అన్నాడు. ఫస్టురౌండు కాఫీలు పూర్తయ్యాయి.

చంద్రశేఖర్ గొంతు సవరించుకుని లేచి నిల్చున్నాడు. 'లేడీస్ అండ్ జంటిల్‌మన్, ఎటెన్షన్ ప్లీజ్....' అన్నాడు. గందరగోళంగా మాట్లాడుతున్న అందరూ నిశ్శబ్దం అయ్యారు. 'టుడే అయామ్ ఇంట్రొడ్యూసింగ్ యూ ఎన్యూ గేమ్' అన్నాడు. అంతా చప్పట్లు కొట్టారు. కుతూహలంగా వినసాగారు.

''ఈ రోజు గేమ్. ఇక్కడున్నది ఆరుగురు మగవాళ్లు-ఆరుగురు ఆడవాళ్ళు! ఆడవారి ఆరు పేర్లు యీ ఆరు చీటీలలో రాశాను. ఈ ఆరు చీట్లని కింద వేయగానే తలోటి తీసుకోవాలి. ఆ చీటీలో ఎవరి పేరుంటే వారు ఈ రోజంతా వారి గేమ్‌కు పార్టనర్‌గా వుండాలి. డాన్స్ చేసినా, కార్డ్స్ ఆడినా, షికారు తిరిగినా వారి పార్టనర్‌గా వుండాలి.

''అచ్చా-అచ్చా. వెరీ యింటరెస్టింగ్'' కిషన్‌చంద్ ఉషారుగా అన్నాడు.

''ఒకవేళ-ఎవరి భార్య వారికే పార్టనర్ అయితే....'' పద్మ సందేహం.

''దట్సాల్సో ఎ పాయింట్ - అలాంటప్పుడు మరోసారి చీట్లు తీసుకోవచ్చు.... ఇదిగో ఈ చీటీలు వేస్తున్నాను తీసుకోండి.'' అన్నాడు. మగాళ్ళందరూ ఆరాటంగా తలో చీటీ తీసారు. అందరికంటె ముందు చంద్రశేఖరే తీశాడు. ఆడవాళ్ళు కుతూహలంగా చూస్తున్నారు తమ పేరు ఎవరికి వస్తుందోనని.

''హాయ్-లక్కీ-కవితా యూ ఆర్ మై పార్టనర్.''అన్నాడు సంతోషంగా రామ్మోహన్ చీటి చూసుకుని, కవిత చిలిపిగా నవ్వింది కన్నుగీటి.

''మేడమ్ యు ఆర్ మై పార్టనర్'' అన్నాడు వర్మ పద్మ దగ్గిరకి వెళ్ళి మర్యాదగా వంగి అన్నాడు. పద్మ సిగ్గుగా నవ్వింది.

డాక్టర్జీ చీటిచూసి ఒక్కక్షణం ఏడుపు మొహం పెట్టాడు. అంతలోనే లేని నవ్వు తెచ్చుకుని 'మిసెస్ కపూర్ నా పార్టనర్' అన్నాడు. సీలిమ అతని మొహం చూసి, 'బాడ్‌లక్ ఐ పిటీ యు డాక్టర్' అంది విచారం అభినయిస్తూ.

డాక్టర్జీ చప్పున సర్దుకుని''నో....నో... మీరు నా పార్టనర్ అవడం నాకు చాలా సంతోషం....'' అన్నాడు.

''అబద్ధాలాడకండి పాపం ఏం చేస్తారు కొన్ని గంటలు నన్ను భరించండి, పాపం మా ఆయన నన్ను జీవితాంతం భరించడం లేదూ....'' నవ్వింది సీలిమ.

''డార్లింగ్ అలా అంటావేమిటి. నీ వంటే నా కెంత ప్రేమ, ఎంత ప్రేమ.'' అన్నాడు కపూర్ కొంటెగా నవ్వుతూ.

''అవునవును, నా లక్షలమీద ఆ మాత్రం ప్రేమ వుండదా ఏమిటి'' సీలిమ నవ్వుతూ అంది. అంతా నవ్వారు.

కిషన్‌చంద్ చీటి చూసి ఉత్సాహంగా లేచి లత దగ్గిరకి వెళ్ళి పక్కన నించుని మాట్లాడకుండా ఆమె బుజంమీద చేయి వేసి ఫొటో పోజు యిచ్చాడు గర్వంగా.

''అచ్చా-వెరీ స్మార్ట్ పెయిర్''అన్నాడు కపూర్ చప్పట్లుకొట్టి.

''మాయాజీ .... మనిద్దరం పార్టనర్స్ ఇవాళ. ఇద్దరం కలిసి చక్కగా డ్యూయట్లు పాడుదాం'' అన్నాడు కపూర్-కపూర్‌ది మంచి గొంతు.

ఒక్కొక్కరు తమ పార్టనర్ పేరు చెపుతూంటే గీత ఆరాటంగా వింటూ అంతా అయి తను, చంద్రశేఖర్ మిగిలిపోగానే ఆమె మొహం ఎర్రపడింది. చురుక్కుమని చంద్రశేఖర్ వంక చూసింది. అది చూచి చంద్రశేఖర్ పెదాలమీద చిన్న కొంటె నవ్వు కదిలింది. అది చూసిన గీత క్రింద పెదవి కసిగా నొక్కింది పళ్ళతో.

''మిస్టర్ చంద్రా వాట్ ఎబౌట్ యూ-?'' కిషన్‌చంద్ ప్రశ్నించాడు.

''ఇంక మిగిలింది ఎవరు గీతకదా.... మీరిద్దరూ నన్నమాట'' రాంమ్మోహన్.

''....కంగ్రాచులేషన్స్ మిస్టర్ చంద్రా. మంచి పార్టనర్‌ని కొట్టేశారు.'' వర్మ అన్నాడు.

''పాపం గీత మాకు పార్టనర్ అవాల్సింది. చక్కగా మరి రెండు బొబ్బట్లు ఎక్కువ పెట్టేది....'' లత మొగుడ్ని వెక్కిరించింది.

''డోన్ట్‌వర్రీ....నా వంతు మీ కిచ్చేస్తాను'' చంద్రశేఖర్ నవ్వుతూ అన్నాడు.

''ఇప్పుడనవసరంగా వాటి పేరెత్తారంటే ముందు భోజనం చేసేద్దాం అంటాడు'' రాం వెక్కిరించాడు. అంతా నవ్వారు.

''థాంక్ గాడ్-ఎవరి పెళ్లాలు వారికి పార్టనర్ అవలేదు'' అంది మాయ.

''సరే, గేమ్ ఆరంభిద్దాం. ముందు డాన్స్‌తో ప్రారంభిద్దాం. తరువాత కార్డ్స్. ఆ తరువాత లంచ్. కాసేపు విశ్రాంతి ఆ టైములో ఎవరి పార్టనర్‌తో కలిసి వాళ్ళు పాటలు పాడాలి. మూడు గంటలకి టీ-

తరువాత ఒకగంట మళ్ళీ కార్డ్స్. ఆ తరువాత ఓ గంట షికారు ఎవరెక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళచ్చు వారి పార్టనర్‌తో. కాని సరిగా ఐదు గంటలకి తిరిగి ఇక్కడికి రావాలి'' గేమ్ గురించి వివరించాడు చంద్రశేఖర్.

''జస్ట్ ఎ మినిట్'' గీత అంది. అంతా అటు చూశారు. "ఈ గేమ్ ఆడుతున్నప్పుడు -ఎవరన్నా అతిగా ప్రవర్తిస్తే, హద్దు మీరితే-'' సూటిగా చూస్తూ అంది గీత.

''ఛా...ఛా....అలా ఎందుకు జరుగుతుంది?''వర్మ నొచ్చుకుంటూ అన్నాడు.

''అలా జరిగితే....'' రెట్టించింది గీత. ఆ ప్రశ్న అర్థం అయినట్లు చంద్రశేఖర్ అదోలా గీత వంక చూసి తలాడించి నవ్వి-ప్యాంటుకు వున్న బెల్టు తీసి ఝుళిపిస్తూ. ''పది బెల్టు చురకలు తినాలి అందరి ముందు'' అన్నాడు కొంటెగా నవ్వి. అంతా 'ఎగ్రీడ్' అన్నారు.

''ఒకవేళ అలా జరిగినా ఏ లేడి రిపోర్ట్ చేయకపోతే'' రాం కొంటెగా వున్న గీటి అన్నాడు.

''ఇష్టమైతే మరే గొడవా లేదు'' కిషన్ చంద్ చిలిపిగా అన్నాడు.

''ఓ కె....ఓ కె....లెటజ్ స్టార్ట్ ద గేమ్'' కపూర్ రికార్డు ప్లేయరు తిప్పాడు. ఇంగ్లీషు రికార్డు తిరిగింది.

చెట్టునీడన, జంపుకానా మీద అందరూ డాన్స్ ఆరంభించారు. చంద్రశేఖర్ వచ్చి చేయి అందించగానే గీత కరకగా అతని కళ్ళలోకి చూసి విసురుగా చేయి అందించింది. గీత నడుం చుట్టూ ఎడం చెయ్యి వేసి కుడిచేత్తో ఆమె చెయ్యి అందిపుచ్చుకుని స్టెప్పు వేస్తూ శేఖర్ కొన్ని క్షణాలు మౌనంగా గీత మొహంలోకి చూస్తూ వుండిపోయాడు. గీత మొహం తిప్పుకుంది. చుట్టూ చూసింది. రాం మోహన్ మహదానందంగా ఈ లోకంలో లేనట్టు కవితతో డాన్స్ చేస్తూ ఆమె నడుంచుట్టూ చేయి గట్టిగా బిగించి చెవిలో ఏదో అంటున్నాడు. కవిత కొంటెగా నవ్వుతుంది. మిగతా అందరూ ఎవరి పార్టనర్‌తో వాళ్ళ గుసగుస లాడుతున్నట్టు మాట్లాడుతున్నారు.


''గీతా!'' నెమ్మదిగా పిల్చాడు శేఖర్.

''కాల్ మీ మిసెస్ రాం.'' గీత చురుగ్గా చూసి అంది కఠినంగా.

''గీతా ఎందుకంత కోపం. ఎన్నాళ్ళయినా నీ కోపం తగ్గదా?'' కళ్ళల్లోకి చూస్తూ ఆవేదనగా అన్నాడు. గీత మొహం తిప్పుకుంది.

''గీతా ప్లీజ్ మాట్లాడు. నీతో మాట్లాడే యీ అవకాశంకోసం ఎన్నాళ్ళనించో ఎదురు చూస్తున్నాను. నీతో ఏకాంతంకోసమే యీ గేమ్ సృష్టించాను. నిన్ను పార్టనర్‌గా చేసుకున్నాను.''

''అయితే ఇదంతా ముందే ఆలోచించి



వేసిన ప్లానన్నమాట'' గీత తీక్షణంగా అంది.

''అవును. నీ చీటి మిగతా వాటికంటె కొంచెం వెడల్పుగా మడిచి, అందరి కంటె ముందుగా నేను తీసుకున్నాను. గీతా నాకు మాట్లాడడానికి యీ ఒక్క అవకాశం ఇయ్యి'' ప్రాధేయ పడ్డాడు.

''నీతో నాకు మాటలేవిటి. ఇంకా మనకి మాటలేం మిగిలాయి. ఐహేట్‌యూ -ఐహేట్‌యూ'' తిరస్కారంగా అంది. కొంచెం దగ్గరలో వున్న వర్మ గీత గొంతులో తీక్షణత గుర్తించి, 'గీతాజీ క్యాహువా?' అన్నాడు. గీత చప్పున మొహంలో భావం మార్చేసి నవ్వుతూ- ''మిస్టర్ చంద్రా చూడండి. ఇంత క్విక్ స్టెప్స్ వేస్తూవుంటే మరో పార్టనర్‌ని తెచ్చుకోమని కేకలేస్తున్నాను'' అంది.

''గీతా నన్నెందుకు అర్థం చేసుకోడానికి ప్రయత్నించవు. నేను చెప్పేది విన్నాక నీ ఇష్టం నీవేమన్నా పడ్తాను'' శేఖర్ మళ్లీ ఆరంభించాడు.

''గీతా మూడేళ్లనించి ప్రయత్నిస్తున్నాను నీతో మాట్లాడే యీ అవకాశం కోసం, గీతా నీతో మాట్లాడడం కోసం మంచి ఉద్యోగం వదులుకుని యీ వూరు వచ్చానని నీకు తెలుసా. నీ కోసం మీ ఆయనతో స్నేహం సంపాదించాను తెల్సా....''

''ఇప్పుడేమి చేద్దామని వచ్చావు,మిస్టర్. ఇటీజ్ టూ లేట్. సుఖంగా సాగిపోతున్న నా సంసారంలో నిప్పులు పోయడమే నీ ఉద్దేశం అయితే అది మాత్రం చెయ్యగలవు'' కఠినంగా అంది గీత.

''గీతా!'' హర్ట్ అయ్యాడు శేఖర్. ''ఎందుకంత కఠినంగా మాట్లాడుతావు. అంత నీచుడిలా కనిపిస్తున్నానా. చేసిన చిన్న తప్పుకి ఇంత పెద్ద శిక్ష వేశావు. కనీసం నా బాధ అయినా అర్థం చేసికోలేవా?'' గిలగిల లాడాడు.

# దీపావళి వస్తోంది జాగ్రత్త!

జీయస్సెస్

'గాంధీ రి తరగతి' వాళ్ళకీ
మధ్యతరగతి మందహాసులకీ
కొత్త అల్లుళ్ళను సంపాదించుకున్న మామలకీ-
ఓ హెచ్చరిక —
'దీపావళి వస్తోంది, జాగ్రత్త!'
వీధుల్లో నిప్పులు రాలుతూంటాయి
'పాదరక్షలు' లేని మీరంతా
వీధుల్లోకి రాకండి.
మీరంతా నిర్జీవమైన మొగాలుగల మొగాళ్ళు
పాపం బాణాసంచాలజోలికి పోకండి.
ఆకాశంలో తళుక్కుమంటున్న
బాణాసంచాల్ని చూస్తూ
చిన్నప్పటి మీ మీపండగ సంబరాల్ని గూర్చి
మీ శ్రీమతికి లెక్చర్లివ్వండి.
మతాబులు కావాలని మారాంచేస్తూన్న
మీ పిల్లలకి కితాబులిచ్చి చదువుకోమనండి
ఊరుకోకపోతే - దగ్గరికితీసుకొని
ఓ కాశీమజిలీకథ చెప్పండి - వాళ్ళకదే పదివేలు!
ఇనుపగజ్జెల తల్లి బాహుబంధాల్లో
గిలగి లాడుతున్న మీరు
తీపి పదార్థాలవంక కన్నెత్తి చూడకండి.
'పిండి కొద్దీ రొట్టె' అన్నది మర్చిపోయి.
సంఘానికి భయపడిపోయి
బంధువుల్ని - అల్లుళ్ళతోసహా - ఆహ్వానించి
'ఋణ సమ్రాట్టులు' కాకండి
దీపావళి వస్తోంది, జాగ్రత్త!

❀

"నీ బాధ నా బాధ కాదు కనక అర్థం చేసుకోవాల్సిన అవసరం నాకు లేదు."

"నీదింత కఠిన హృదయమని ఎన్నడూ అనుకోలేదు. అసలు జరిగిన సంగతి విని...."

"మిస్టర్ వృధా శ్రమ పడకు, ఆ సంగతులు వినాలని నాకు లేదు. ఆ సంగతులు గుర్తూ లేవు. అవన్నీ మరిచిపోయి చాలా కాలం అయ్యింది" బింకంగా అంది గీత.

"అబద్ధం. నీవు మరవ లేవు. అది నాకు తెలుసు. మరిచిపోయావని ఆత్మ వంచన చేసుకుంటున్నావు. నీవు నన్ను మరిచిపోలేదని ఆ రోజు-నన్ను మీ ఇంట్లో చూడగానే ఆ విషయం నీ మొహమే చెప్పింది."

'హు....నీలాంటి నీచుడ్ని మరిచిపోకుండా యింతకాలం గుర్తుంచుకుంటానని నీవనుకుంటే అది నీ భ్రమ. నీవా రోజునే నా మనసులో చచ్చిపోయావు."

"మనిషి చచ్చిపోయినా మమతనిలిచిపోతుంది గీతా!" ఆర్ద్రంగా అన్నాడు శేఖర్.

"అలా నీవనుకుని సంతోషపడితే నాకేం అభ్యంతరం లేదు. మిస్టర్ చంద్రశేఖర్. నా మనసులో నీకు సూది మొనంత స్థానం కూడా లేదు. నా మనసులో నా భర్తకే స్థానం. నా అదృష్టం కొద్దీ నీ వాత పడకుండా యిలాంటి ఉత్తముడిని భర్తగా పొందాను." గీత గర్వంగా తలెగరేసి అంది. శేఖర్ అదోలా నవ్వాడు.

"మంచిదే, నీ భర్త అంత ఉత్తముడు అని నీవనుకుంటూ సుఖంగా బ్రతకడం నాకు సంతోషమే. నీ సంతోషం కంటె నాకేం కావాలి."

గీత ఏదో అనబోయింది. ఇంతలో రికార్డు ఆగింది. డ్యాన్సు ఆపి అంతా చప్పట్లుకొట్టారు. అలిసిపోయినట్లు సుతారంగా చెమట అద్దుకుంటూ వచ్చింది కవిత. రామ్‌మోహన్ గీత దగ్గిరికివచ్చి 'హౌడు యూ లైక్ యువర్ పార్టనర్' అన్నాడు నవ్వుతూ. గీత జవాబివ్వలేదు.

"యిప్పుడు కార్డ్సు ఆడదాం-బ్రిడ్జి ఆడే వాళ్లు చేతు లెత్తండి" కిషన్‌చంద్ అన్నాడు.

"బ్రిడ్జిబోర్, మేం 'రమ్మీ' ఆడుకుంటాం." కవిత అంది.

"మనం తిన్న తరువాత ఆడుకోకూడదూ" వర్మ అన్నాడు ఆయాసంగా చతికిలబడి.

"ఏం పొట్ట అప్పుడే ఖాళీ అయిందా ఏమిటి యింకాస్త కరగనీండి - మరి రెండు బొబ్బట్లు - తినచ్చు" అంది లత.

"ఇదిగో లతా, ఈరోజు నీవు నన్నేం అనడానికి వీలులేదు. ఆ హక్కు నా పార్ట

సర్‌కి తప్ప నీకు లేదు.''

''సరే బాబూ సరే.'' లత కార్డ్సు కలుపుతూ అంది. నలుగురు రమ్మీ నలుగురు బ్రిడ్జికీ- నలుగురు కారమ్స్‌కి కూర్చున్నారు.

పేకాడుతున్నంతసేపు శేఖర్ జోక్స్ కట్‌చేస్తూ అందరిని నవ్విస్తూన్నాడు. గీత తనవంక అతను చూసినపుడల్లా స్నేహం చిల్కిస్తూంది.


''మిసెస్ రాం. మీ రేమిటి యివాళ యిలా వున్నారు. వంట్లో బాగుండా?'' చటర్జీ గీత ముభావంగా వుండడం కనిపెట్టి అడిగాడు.

''అబ్బే ఏం లేదు.....నిన్న రాత్రి అంతా సరిగా నిద్రలేదు. టైర్డ్‌గా ఫీలవుతున్నాను. అంతే'' అంతకంటె ఏమంతేదన్నా చెపితే మందులు మింగమంటాడని అంది గీత.

పన్నెండున్నర అవగానే అంతా గేమ్స్ కట్టిపెట్టి భోజనాలకి లేచారు. ఆడవాళ్ళు ఎవరు తెచ్చిన కారియర్ వాళ్లు విప్పారు. వర్మ గీత కారియర్ దగ్గిరచేరాడు. కిషన్ ప్లేట్లన్నీ నేప్‌కిన్‌తో తుడిచాడు. మాయ ప్లేట్లలో అన్ని వడ్డిస్తూంది. వర్మ ప్లేటు రెడీగా పెట్టుకున్నాడు. ''గీతా, ముందు నీ బొబ్బట్లు ఆ 'యిమ్లీభాల్' ఆయనకి పెట్టు - మరోక్షణం ఆలస్యం చేయిందంటే కారియర్‌మీద దాడిచేసి ఏకేం మిగల్చేట్టులేడు'' కవిత అంది నవ్వుతూ. గీత నవ్వుతూ ముందు వర్మ ప్లేట్లో బొబ్బట్లు, పులిహోర పెట్టియిచ్చింది

'బహుత్ అచ్ఛాహై గీతాజీ' వర్మ తింటూ మెచ్చుకున్నాడు. ఏ పార్టీ అయినా పిక్నిక్ అయినా గీత బొబ్బట్లు పులిహోర చెయ్యాలని వర్మ స్టాండింగ్ ఆర్డర్స్ - మొదటిసారి సంక్రాంతికి అందరిని డిన్నరుకి పిలిచి యివి చేసింది. అప్పటినుంచి వాటిరుచి మరిగారు అందరూ - వర్మ అయితే యింకా యింకా అడిగి వేయించుకుని తిన్నాడు. 'పులిహోరలో పెరుగు కూడా వేసుకోండి, యింకా బాగుంటుంది' అంటూ గీత గడ్డపెరుగు వేసి ఆ రుచి నేర్పి వదిలింది. మిసెస్ ఇండిపన్ డిషన్ బ్రహ్మాండం అంటూ గీతని అస్తమానూ అవే చెయ్యమంటారు అందరూ. అలాగే మిసెస్ చంద్రశేఖర్ 'సాంబార్ సాదం దహీవడ' రుచి తెలుసుకుని ఆమెని అదే తెమ్మని చంపుతారు - మిగతా వాళ్ళ వంటకాలు మారినా వీరిద్దరివి మారవు ప్రతి సారి.

అందరూ ఒకరి వంటకాలు ఒకరు పొగుడుకుంటూ, ప్లేట్లల్లో బలవంతాన దిమ్మరిస్తూ, చలోక్తులతో, హాస్యాలతో అంతా లంచ్ ముగించారు. లత పెద్ద ఫ్లాస్కునిండా తెచ్చిన ఐస్‌క్రీమ్ అందరికీ యిచ్చింది. అపర్న కిళ్లీ-రామ్ చాలా ఉత్సాహంగా కవితతో కబుర్లు చెప్పేస్తున్నాడు. గీత అతనంతలా ఎన్‌జాయ్ చేస్తుంటే వారిద్దరిని కాస్త ఈర్ష్యగా చూసింది.



''అమ్మ బాబోయ్ యిప్పుడు ఒక అర గంట పడుకోవాలి'' అంటూ భుక్తాయాసంతో తలగడ ఒకటి అందుకుని జంపుకానా మీద వరిగిపోయాడు వర్మ.

''అదేం వీలులేదు. యిప్పుడు పాటల కార్యక్రమం. లేవండి'' అదరగొట్టింది లత.

''నాతరం కాదు యిప్పుడు. ఉత్తప్పుడే గొంతు పెగలదు, యిప్పుడు పీకలదాకా తిన్నాను. ముందు మీరంతా కానీండి. యి లోపల కాసేపు కన్ను మూస్తాను.'' అంటూనే మగతగా కళ్ళుమూసి నిద్రకవి జారిపోయాడు వర్మ.

మాయా, కిషన్ కలిపి బెంగాలీ పాటలు, రవీంద్ర గీతాలు పాడారు, సవ్యంగా పాడగలిగినవారు వాళ్ళిద్దరే! మిగతా వాళ్ళంతా తప్పుల తడకలతో అపస్వరాలతో డ్యూయట్లు పాడడం, అందరూ కలిపి చప్పట్లు కొట్టడం, నానాగోలగా తయారయింది పాటకచేరి. కపూర్ లతని యీడ్చుకువెళ్ళి ఇద్దరూ కలసి బాంగ్రానృత్యం చేశారు. రాంమోహన్ తెలుగు సినిమాపాటలు అపస్వరాలతో పాడి, అందర్నీ నవ్వించాడు. గీతవంతు వచ్చేసరికి ససేమిరా చంద్రశేఖర్‌తో కలిసి పాడడానికి ఇష్టపడలేదు. వంట్లో బాగులేదని తప్పించుకుంది. అది గుర్తించి చంద్రశేఖర్ 'మా పార్ట్‌నర్ బదులుకూడా నే పాడతాను. ఆమెని ఇబ్బంది పెట్టకండి' అన్నాడు. శేఖర్ గొంతు బాగానే వుంటుంది. మంచి విషాద గీతం ఒకటి అందుకున్నాడు. అతని గొంతు శ్రావ్యం, విషాదం అందరినీ ఆకట్టుకుంది. తెలుగు అర్థం కాకపోయినా అంతా తలలు ఊపారు. ప్రేమించిన ప్రియురాలు అపార్థం చేసుకుని ప్రేమను కాలదన్ని వెళ్ళిపోతే ప్రియుడు ఆవేదనతో పాడే పాట అది. పాటలో భావానికి గీతమొహం

ఎర్రబడింది. అతని గొంతులో కంపనకి గీత అదోలా అయింది.

'వండర్‌ఫుల్....భగ్న ప్రేమికుడి వేమి టోయి చంద్రా - అంతటి పాడి పప్పిం చావు విషాదం - ఎవరో ఆ లైలా!' హాస్యం ఆడాడు రాంమోహన్; 'ఏమండీ పద్మా! మీ వారికి పార్వతి మీరు కాదే మిటి?''

''పెళ్లాన్ని ప్రియురాలిగా భావించుకునే మగాళ్లున్నా రేమిటి?'' చురక అంటించింది పద్మ.

''అన్యాయం మీరు తెలుగులో ఏమిటో మాట్లాడుకున్నారు మాకు తెలియకుండా'' చటర్జీ అన్నాడు. రాంమోహన్ పాటలో భావం, తమ మాటలు ఇంగ్లీషులో చెప్పాడు.

''హాయ్ చంద్రా! ఏమిటి సంగతి - చెప్పవోయి సరదాగా'' కపూర్ హాస్యం ఆడాడు.

''అరే బాబూ! ఇది పాట, రాసింది నేనుకాదు. మతిపోయిందా ఏమిటి మీకు'' అన్నాడు నవ్వి శేఖర్.

వర్మ పాటవంతు వచ్చేసరికి గురక విన్పించింది. ''అదే అతని పాట. లేపినా అంతకంటె మంచి పాట మనం ఎలాగో వినలేం. పడుకోనీయండి'' అంది లత నవ్వుతూ. ఒక్కొక్కరుగా బద్ధకంగా ఆవు లిస్తూ తలగడలమీద వరిగిపోయారు. గీతకి నిద్రపట్టలేదు. మరో జంపుకానామీద మగవాళ్ళంతా పడుకున్నారు. చంద్రశేఖర్ వెల్లకిలా పడుకుని సిగరెట్ కాలుస్తు న్నాడు....ఈ చంద్రశేఖర్ మళ్ళీ తన జీవితంలో ఎందుకు ప్రవేశించాడో! గతం అంతా తుడిచేసుకుని పెళ్లి చేసుకుని కొత్తగా రాంమోహన్ మనసులో స్థానం ఏర్పరచి గతం మరిచిపోయింది. ఆనాడు చంద్రపట్ల అంత ఏ ఖ్యాత పెరగకపోతే ఇంత సుళువుగా మరిచిపోగలిగేదా! మరిచి పోయిందా! నిజంగా తుడిచేసుకుందా అతని రూపుని? మళ్ళీ....వచ్చి తన మనశ్శాం తిని హరించడానికి వచ్చిన అతన్ని గీత క్షమించలేక పోతూం .

పెండ్లికిపూర్వం రాంమోహన్‌తో మొదటి సారిగా ఇంటికి వచ్చిన అతన్ని చూసిన దగ్గరనించి, ఏం జరుగుతుందో ననే భయ ముతో అనుక్షణం బెదురుతూంది. కాని అంత నీచుడవగలడా చంద్ర. చూస్తుంటే అతను చాలా బాధపడ్తున్నట్లున్నాడు ఏదో చెప్పాలని ఆరాటపడ్తున్నాడు. వింటే. ప్చ్ విని ఏం ప్రయోజనం? చంద్ర ఆవేదన చూస్తుంటే తనే తొందర పడిందేమో! కాని-కాని-' అప్రయత్నంగా అటుచూసిన గీత శేఖర్ చూపులు కలవగానే తడబడి అటు తిరిగిపోయింది.

వర్మ పెద్దగా ఆవలించి లేచాడు. 'అబ్బ ఎంత మంచినిద్ర పట్టింది. మీ బొబ్బట్లు మహాత్యం గాబోలు, మత్తు వచ్చేసింది' అన్నాడు నవ్వి. ఒక్కొక్కరూ లేచారు. పద్మ స్టౌ వెలిగించి టీ కి నీళ్ళు పెట్టింది. కపూర్ టీ కలిపాడు. బిస్కట్లు టీ సర్దింది కవిత. మగాళ్ళంతా లేచి చన్నీళ్ళతో మొహం కడిగి బద్ధకం వదుల్చుకున్నారు. అంతా టీ ఆరంగించారు.

''కాస్త మనం మొహాలు కడుక్కుంటే బాగుండును'' అంది లత.

''వెళ్ళరండి! అదిగో అక్కడ గెస్ట్ హౌస్ వుంది. వాచ్‌మన్‌తో చెప్పనా తలుపు తెరవమని'' కిషన్‌చంద్ అన్నాడు.

''డోన్ట్‌వర్రీ! వుయ్‌విల్ మానేజ్'' అంది నీలిమ. ఆడవాళ్ళంతా హాండ్ బ్యాగులు పట్టుకు అటువెళ్లారు.

''మనమూ వెడితే బాగుండేది,మొహాలు జిడ్డోడుతున్నాయి'' అన్నాడు రాం.

''పరవాలేదు మగవాళ్ళం, మనకేం వుంది. నీ పార్టనర్ ఏం ముద్దుపెట్టుకోదు గదా'' అన్నాడు హాస్యంగా వర్మ.

ఆడవాళ్ళు మొహాలు కడిగి, పౌడర్లు కొట్టి, మేకప్ అయి ఫ్రెష్‌గా తయారయి వచ్చారు అరగంటకి.

అంతా చేరాక బాస్కట్లు సర్ది, సామా నంతా కారుల్లోపెట్టి లాక్‌చేశారు. ''సరిగా నాలుగయింది ఇప్పుడు....ఇప్పు దెవరిష్టం వచ్చినచోటుకి వారు తిరిగి రావచ్చు ఒక గంటన్నర''అన్నాడు చంద్రశేఖర్.అందరి కంటే ముందు రాంమోహన్ కవిత దగ్గి రకు చేరాడు. ఇద్దరూ కలిసి నడుచుకుంటూ వెళ్ళిపోతుంటే గీత అటే చూసింది. ఎవరి పార్టనర్స్‌తో వారు కబుర్లు చెప్పుకుంటూ అంతా తలో వైపు వెళ్లారు. ఆఖరికి గీత చంద్రశేఖర్ మిగిలారు. 'గీతా రా, అలా తిరిగివద్దాం' అన్నాడు శేఖర్.

''నేను రాలేను, నన్ను వదిలేయ్.''

''గీతా, ప్లీజ్, నలుగురూ ఏమన్నా అనుకునే అవకాశం యియ్యకు. పద అలా తిరిగివద్దాం.కాకపోతే అందరికీ అనుమానం వస్తుంది'' అభ్యర్థనగా అన్నాడు.

అంతలోనే కొంచెం దూరం వెళ్ళిన వర్మ వెనక్కితిరిగి గీతా వాళ్ళు యింకా అక్కడే వుండడం చూసి కాస్త ఆశ్చ ర్యంగా ''మీరెక్కడికీ వెళ్ళరా, గీతాజీ మీకేమయింది యివాళ. చంద్రా మీ పార్ట నర్ డల్‌గా వుంది. చీర్ అప్ మైబాయ్.'' కన్ను గీటి నవ్వి వెళ్లాడు.

తప్పదన్నట్టు లేచింది. అతని పక్కన నడుస్తుంటే గీత ఆలోచనలు ఎటో వెళ్ళాయి. అప్పుడు అతని పక్కన ఇలా నడుస్తూ తనని తాను మరిచేది. జీవితాంతం జంటగా అలా నడవాలని కలలుకంది.... కాని—

''గీతా. అప్పుడు యిలా నడుస్తూ ఎన్ని కబుర్లు చెప్పుకునేవారమో గుర్తు లేదా....ఏమిటా ఆలోచన మాట్లాడు గీతా!''

''ఏం లేదు, గీతా అని ఇంకా ఎలా పిలుస్తున్నావా అని—'' వ్యంగ్యంగా అంది గీత.

''గీతా, గీతా ఒక్కసారి కాదు వంద సార్లు రోజుకి నీపేరు తలుస్తూనే వుంటాను. నీవు దూరం అయినా నీ జ్ఞాపకాలు దూరం కాలేవు....''

''ఇలా మాట్లాడడానికి సిగ్గుపడాలి నీవు. నేను రాంమోహన్ భార్యనని తెలిసీ పరాయిస్త్రీ గురించి నీవిలా ఆలో చిస్తున్నావంటే నీ వెంత నీచుడివో అర్థం అవుతుంది.''

'పొరపడ్తున్నావు గీతా, ఆరాధనలో అశ్లీలానికి, అసభ్యతకి చోటుండదు. నీ వెపుడు గుర్తువచ్చినా చల్లని వెన్నెల తాకి

నట్లు పూల పరిమళం సోకినట్లు నన్నని వానజల్లులా, కమ్మని పాట విన్నప్పుడల్లా మనసు పులకరిస్తుంది. ఎంత చికాకులో వున్నా నిన్ను గుర్తు తెచ్చుకుంటే నా మనసు ఉపశమిస్తుంది. గీతా పట్ల నా అనురాగం ఇప్పుడే కాదు ఎప్పటికీ పోదు'' ఎమోషనల్‌గా మాట్లాడుతున్న అతని మాటలు విని గీత ఒక్క క్షణం చలించి అంతలోనే చింతగా "హుం- ప్రేమని గురించి నీవు మాట్లాడుతూంటే, ప్రేమ అన్న పదానికి అర్థం మారిపోయిందనిపిస్తూంది. నీ దృష్టిలో ప్రేమ అంటే ఎంత తేలికైనది'' వ్యంగ్యంగా అంది.

"నిజమే గీతా, ఒక్క క్షణం దౌర్బల్యం నా జీవితగతినే మార్చివేస్తుందని తెలుసుకోలేకపోయాను. కాని ఒక్కటి నమ్ము గీతా, ప్రేమ అన్నది మనసుకి సంబంధించింది. పైకి కనిపించేదానికి విలువ నివ్వకూడదని తెలుసుకో గీతా'' నిట్టూర్చుతూ అన్నాడు.

"అవును మనసన్నది కనపడదు కనక ఏమైనా చెప్పొచ్చు, కంటికి కనపడింది నమ్మకుండా, కనపడని దానిమీద విశ్వాసం నిలుపుకునేటంత ఉన్నతురాలిని కాను నేను-'' హేళనగా అంటూ- "ఇంతకీ ఈ సంజాయిషీలు నేను అడగలేదు. హాయిగా పెళ్ళిచేసుకున్నావు. పెళ్లి చేసుకున్న పెళ్ళాన్ని ఒక ప్రక్క- ఇంకో పక్క ఇంకోరి భార్యను ప్రేమిస్తున్నానని చెప్పడం సభ్యతా సంస్కారం వున్నవారు చేసే పనిగాదు.'' తిరస్కారంగా అంది గీత.

"హుం-నా భార్యని ప్రేమిస్తున్నానని నీవెలా అనుకున్నావు. నా శరీరం, నా ఇంట్లో స్థానం మాత్రమే ఇచ్చాను మనసు గాదు.''

"అలా చెప్పడానికి సిగ్గుపడాలి. ఇలా ఎంతమంది ఆడవాళ్ల జీవితాలు నాశనం చేయాలనుకుంటున్నావు ...''

"గీతా ఒక మనిషిపట్ల విముఖత ఏర్పడితే ఆ మనిషిలో మంచి కనబడలేరు ఎవరూ. ఎంతసేపూ చెడే కన్పిస్తుంది. నీకు ఏం చెప్పినా నన్నర్థం చేసుకోవని నాకు తెలుసు. కనీసం నన్ను గురించి చెప్పుకునే రెండు మాటలు నీ కిష్టం లేకపోయినా విను. అంతే నేను కోరేది. ఇక్కడ కూర్చుందామా కాసేపు'' అన్నాడు రెండు పెద్ద రాళ్ళు చూపుతూ చెట్లనీడని వున్న ఆ రాళ్ళమీద కూర్చున్నారు ఇద్దరూ. పైకి చింతగా వున్నా గీతకి అతనేం చెపుతాడో వినాలని మనసులో వుంది. ఇష్టం లేనట్టే మొహం తిప్పుకు ఎటో చూస్తూ కూర్చుంది.

"గీతా! ఒక్క ప్రశ్నకి జవాబు చెప్పు. నిజంగా నన్ను మరిచిపోయావా గీతా, నీ మనసులో నాకు చిన్న స్థానం అయినా లేదా నిజం చెప్పు.'' సూటిగా చూస్తూ



ఆర్ద్రంగా అడిగాడు శేఖర్. గీత తడబడి జవాబు చెప్పలేనట్లు మొహం తిప్పుకుంది. శేఖర్ నిట్టూర్చాడు. "గీతా ఆ రోజు నన్నలా నళినితో చూసిన నీ మనస్థితి వూహించగలను. ఆ క్షణంలో నా మీద నీకెంత ఏహ్యత ఏర్పడిందో అర్థం చేసుకోగలను. ఆ తరువాత నన్ను కలవకుండా, నాతో మాట్లాడకుండా, నాకు మాట్లాడే అవకాశం ఇయ్యకుండా మీ వాళ్ళు కుదిర్చిన పెళ్లి ఎందుకు చేసుకున్నావో నేను అర్థం చేసుకున్నాను. నీవే నన్ను అర్థం చేసుకోలేదు. కనిపించిన దాని వెనక ఏదన్నా కథ వుండచ్చని ఒక్కక్షణం ఆలోచించలేకపోయావు. చేసిన తప్పో వప్పో చెప్పుకునే అవకాశం నాకు ఇయ్యకుండా నన్ను శిక్షించావు. నళిని నీకంటె అందగత్తె అవచ్చు, నీకన్న శ్రీమంతురాలవచ్చు.కాని నీవెందుకో నన్నాకర్షించావు. మన ఇద్దరి స్నేహం ప్రేమగా మారి వివాహ బంధంతో జీవితం ముడి వేసుకోవాలనే మన తలపులు నళిని అనే విషవలయంలో నేను చిక్కుకుని నిన్ను పోగొట్టుకున్నాను. ఆ అహంభావి తన అంత అందగత్తె కోరుతూంటే నేను నిర్లక్ష్యం చేస్తున్నాననే కక్షకొద్దీ పంతం పట్టి మనల్ని వేరు చేసి పగ సాధించింది. సినిమాలలో సీను మాదిరి నన్ను పిలిచి, ఆ వేళకి నిన్ను రమ్మని నీవు వచ్చేసరికి నన్ను కౌగిలిలో బంధించి అది నీ కంట బడేట్టు చేసింది. నీవు చూసింది నిజం కాదని నేనిపుడు చెపితే నన్ను నమ్మవు. కాని అది నిజం గీతా! ఆ క్షణం నించి నేను అనుభవిస్తున్న నరకం నీకర్థం కాదు గీతా'' ఆవేదనగా చెపుతున్న అతని మాటలకి గీత ఒక్క క్షణం చలించింది.

"గీతా, నన్ను క్షమించానని ఒక్కసారి చెప్పు'' ఆవేశంగా గీత చేతులు పట్టుకుని దీనంగా అన్నాడు. అతని స్పర్శకి గీత అదోలా అయింది.

"ఇప్పుడింక నా క్షమాపణకి అర్థం లేదు శేఖర్'' తల దించుకుని అంది.

చేతులు వదిలించుకుని. "నేనిప్పుడు నీ గీతని కాదు. మిసెస్ రాంని.గీతని కాదు కనక నా క్షమాపణ అనవసరం కాదా" అంది. 'అది నీకు తృప్తి నిస్తుందంటే అలాగే చెపుతాను.'

"పోనీ, నీకంతా చెప్పాను. నా గుండెల్లో భారం దించుకున్నాను. అంతే చాలు" తృప్తిగా అన్నాడు చంద్రశేఖర్. "కనీసం నీ స్నేహమన్నా దూరం చెయ్యకు."

"ఇంకవెళదామా," గీత నిలుచుని అంది ఆ మాట విననట్లు ఇద్దరూ నడవసాగారు.

కొద్దిదూరం నడవగానే, దట్టంగా చెట్ల మధ్య గుబురుగా పొదలులాగ పెరిగిన లతల చాటునించి వినవచ్చిన నవ్వులకి గీత హఠాత్తుగా ఆగిపోయింది అటు చూసింది. ఒకరి కౌగిలిలో ఒకరు కరిగిపోతూ నవ్వుకుంటూ ప్రేమ మాటలు వల్లిస్తున్న ఆ జంటని చూసి గీత నిశ్చేష్టురాలై నిలబడి పోయింది. శేఖర్‌తో చూపులు కలవగానే ఆమె మొహం పాలిపోయింది. శేఖర్ ఆరాటంగా గీత వంక చూశాడు. ఆమె మొహం అంతలో ఎర్రబడింది. ఆవేశంగా అటు వెళ్ళబోయింది. శేఖర్ చెయ్యి గీత బుజం పట్టి వెనక్కి లాగింది. ఆమె బుజం చుట్టూ చెయ్యి వేసి ఓదార్పుగా బుజం తట్టాడు. ఆమె విదిలించుకో పోయింది. శేఖర్ ఆమెని ఒక విధంగా బలవంతంగానే భుజం పట్టి నడిపించుకుని తీసికెళ్ళిపోయాడు.

5-30 గంటలకి ఒక్కొక్కరు వచ్చి చేరారు. అంతవరకు ప్రాణం లేనట్టు కూర్చున్న గీత, అందరూ వెళ్ళడానికి తయారు కాగానే లేచి నిలబడి, 'ఆగండి' అంది గంభీరంగా. అంతా ఆశ్చర్యంగా గీత వంక చూశారు. గీత మొహం ఎర్రబడి వుంది. ఆవేశం దాచుకుందామన్నా అణగడం లేదు.

"నా పార్ట్‌నర్ హద్దులు మీరాడు. ఇందాక చెప్పిన శిక్ష అమలులో పెట్టమంటారా?" అంతా అవాక్కయి పోయారు ఒక్క క్షణం. చంద్రశేఖర్ తెల్లబోతూ గీతని నమ్మలేనట్లు చూశాడు. అందరి చూపులు చంద్రశేఖర్ మీదకి తిరిగాయి. శేఖర్ మొహం నల్లగా మాడిపోయింది. రాంమోహన్ ఆరాటంగా గీత దగ్గిరకి వెళ్లి "గీతా, ఏం జరిగింది....ఏం జరిగింది చెప్పు?" ఆవేశంగా అడిగాడు.

"మిస్టర్ చంద్రా ఏమిటిది. నిజమేనా?" తెల్లబోతూ అడిగాడు వర్మ.

రాంమోహన్ కోపంగా చంద్రశేఖర్ దగ్గిరకి వెళ్లి కఠినంగా "ఏం చేశావు గీతని....చెప్పు?" అన్నాడు పళ్ళు బిగువున. చంద్రశేఖర్ అయోమయంగా చూశాడు గీతని-అందరిని. గీత చరచర వచ్చి రాంమోహన్‌ని పక్కకి లాగి చంద్రశేఖర్ వంక చూసి 'మిస్టర్ మీ బెల్టు ఇస్తారా?' అంది. అందరూ ప్రాణం లేని బొమ్మల్లా నిలబడ్డారు. శేఖర్ గీతని చూస్తూ నెమ్మదిగా బెల్ట్ ఊడదీసి గీత చేతికిచ్చాడు. అందరూ ప్రాణాలుగ్గ పట్టుకుని చూస్తున్నారు. గీత బెల్ట్ పట్టుకుని చటుక్కున రాంమోహన్ వంక తిరిగింది. "మిస్టర్ రాం, గేమ్ పార్ట్‌నర్ హద్దులు దాటితే పది బెల్టు చురకలు శిక్ష! మరి లైఫ్ పార్ట్‌నర్ హద్దులు దాటితే ఎన్ని దెబ్బలు తినాలంటారు?" బెల్టు ఝళిపిస్తూ తీవ్రంగా అడిగింది రాంమోహన్‌ని.

రాంమోహన్ 'గీతా' అన్నాడు ఆశ్చర్యంగా తెల్లబోతూ.

"అవును, హద్దులు మీరింది 'గేమ్ పార్ట్‌నర్' కాదు, 'లైఫ్ పార్ట్‌నర్'. ఎన్ని బెల్టు చురకలు తగిలిస్తే బుద్ధి వస్తుందో చెప్పండి" సూటిగా చూస్తూ కటువుగా అంది.

పాలిపోయిన శేఖర్ మొహంలోకి రక్తం ఒక్కసారిగా పొంగింది. ఒక్కసారిగా దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు. రాంమోహన్ తత్తరపడి పోయాడు. 'గీతా, ఏమిటిది' అన్నాడు గొంతు పెగుల్చుకుని.

"ఏమిటో ఇంకా విడమర్చి చెప్పాలా. మిస్టర్ రాం చీట్లు తీసి పార్ట్‌నర్‌ని మార్చుకోడానికి ఇది గేమ్ కాదు. లైఫ్! పార్ట్‌నర్‌ని మార్చుకోవాలంటే కోర్టు, విడాకులు చాలా తంతు వుంది."

'గీతా! ఏమిటి నీ ఉద్దేశం. ఏమిటీ అల్లరి-" ఆందోళనగా, భయం భయంగా అన్నాడు బెల్టు వంకచూస్తూ.

"భయపడకండి - కొట్టను ఆడదానికంత సాహసం ఎక్కడ వస్తుంది లెండి. నలుగురి ముందు కొడితే - ఆ మొగుడితో మళ్ళీ పిల్లలకోసమన్నా రాజీపడి బ్రతకవచ్చిన ఆడదాన్ని - అది నాకే అవమానం కదా! ఇంట్లో పెళ్లాంతో-బయట అవకాశం వస్తే మరో ఆడదానితో ప్రేమలు-ఎందరి జీవితాల్తో అయినా ఆటలాడగలరు మీరు. కారమ్స్‌గేమ్‌లో ఎన్ని కాయిన్స్ పోకెట్ చేస్తే అంత గొప్ప! ఎందరి ఆడవాళ్ళని ఆకర్షించగలిగితే అంత మగతనం! మీరు కొట్టే దెబ్బలకి తలవంచి మీరు కొట్టిన చోట పడుండాల్సిన 'కాయిన్స్' మేము స్ట్రైకర్‌ని 'కాయిన్స్' ఎన్నటికీ కొట్టి గెలవలేవు. ఇది మీ గేమ్. ఆడది తన ప్రేమని, అనుభూతుల్ని గుండెల్లో సమాధి చేసుకుని కట్టుకున్నవాడితో రాజీపడి బ్రతుకుతూ నవ్వు నటించాలి. కాని మీకేం అవసరం." ఆవేశంగా మొదలుపెట్టిన గీత గొంతు మధ్యలోనే పూడిపోయింది. కళ్లు నిండసాగాయి. చప్పున చేతిలో బెల్టు విసిరేసి గబగబ కారెక్కి కూర్చుంది.

తెలుగు అర్థంకాని మిశ్రా వారు తెల్లబోయి చూస్తున్నారు, భాష తెలిసినా భావం తెలియని పద్మ అంతకంటె తెల్లబోయి చూస్తోంది. భాష, భావం అర్థం అయిన రామ్, శేఖర్ ఒకరి వంక ఒకరు చూసుకున్నారు. రామ్ మొహం నల్లగా మాడిపోయింది.

"ఏమిటి - ఏమిటి - ఏం అయింది?" అంతా ఆరాటంగా చుట్టుముట్టారు.

"ఆ....ఏం కాదు. ఇదీ ఒకగేమ్ _ భార్య భర్తల కీచులాట - అంతకన్న ఏం లేదు. గీత రామ్‌మీద అలిగింది. అంతే.... అంతే..." శేఖర్ అందరికి ఏదో సర్ది చెపుతూ నవ్వు నటించాడు అంతా కారెక్కారు.

కార్లు కదిలాయి.

★★★